
సాక్షి
చిత్తూరు
బుధవారం । 25 । జనవరి । 2023



బంగారం :
24 క్యారెట్లు 10 గ్రాములు రూ.54,000
22 క్యారెట్లు ఒక గ్రాము రూ.5,100
వెండి:
హోల్‌సేల్ ధర (కిలో) రూ.70,000
రిటైల్ వెండి గ్రాము రూ.73



	గరిష్టం	కనిష్టం
చిత్తూరు	31	17
తిరుపతి	31	18
తిరుమల	26	13
గూడూరు	31	20
నగరి	32	18



సామూహిక అక్షరాభ్యాసం రేపు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో గురువారంసామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ఈఓ వెంకటేశు తెలిపారు.

న్యూస్‌రీల్

జిల్లాలో 1639 ఎస్సీ, ఎస్టీ శ్మశాన వాటికలు అవసరం

కలెక్టర్‌కు నివేదిక
స్థలాల పరిశీలనకు ఆదేశం

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో 1,639 ఎస్సీ ఎస్టీ గ్రామాలకు శ్మశాన వాటికలు అవసరమని కలెక్టరేట్ అధికారులకు జిల్లా పంచాయతీ కార్యాలయం నివేదించింది. జిల్లాలోని పలు ఎస్సీ, ఎస్టీ గ్రామాల్లో శ్మశాన వాటికలు లేక ఇబ్బందులు పడుతుండటంపై జిల్లా అధికారులకు వినతులు అందుతున్నాయి. వీటిపై స్పందించిన కలెక్టర్ హరినారాయణన్ ఎన్ని శ్మశాన వాటికలు అవసరమో నివేదిక ఇవ్వాలని జిల్లా పంచాయతీ కార్యాలయ అధికారులను ఆదేశించారు. దీంతో కొన్ని రోజులుగా సర్వే చేసిన సిబ్బంది నివేదిక సమర్పించారు. జిల్లాలో మొత్తం 1,113 ఎస్సీ గ్రామాలు ఉన్నాయని, ఇందులో 761 శ్మశానవాటికలు ఉన్నాయని, ఇంకనూ 352 అవసరం ఉందని నివేదికలో పేర్కొన్నారు. అలాగే 253 ఎస్టీ గ్రామాలు ఉండగా, వాటిల్లో 146 శ్మశాన వాటికలు ఉన్నాయని, 107 అవసరమని గుర్తించారు. మొత్తంగా అన్నింటికీ కలిపి 1,639 అవసరమని నివేదించడంతో వీటి కోసం స్థల పరిశీలన చేయాలని తహసీల్దార్ కార్యాలయాలకు కలెక్టరేట్ నుంచి ఆదేశాలు అందాయని తెలిసింది.

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

ప్రధానమంత్రి మత్స్య యోజన పథకంపై అవగాహన కల్పించండి
జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్



మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

చిత్తూరు కలెక్టరేట్ మత్స్యకారులు అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం పలు శాఖల అధికారులతో ఆయన సమీక్షించారు. జిల్లాలో ఇటీవల కాలంలో భారీ వర్షాలు నమోదు కావడంతో మత్స్య సంపద వృద్ధి చెందిందన్నారు. చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు లక్ష నుంచి కోటి రూపాయల వరకు రుణాలు 40 నుంచి 60 శాతం రాయితీతో ప్రభుత్వం ఇస్తుందని, వివిధ రాయితీలపై మత్స్యకారులకు అవగాహన కల్పించి, రుణాలతో వారు లబ్ధి పొందేలా చూడాలన్నారు. మహిళా సంఘాలకు రుణాలు ఇచ్చి తద్వారా మరింత ఎక్కువ మందికి ఉపాధి కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో మత్స్యశాఖ డీడీ రవికుమార్ రెడ్డి, జెడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ తులసి, వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీదేవి, లీడ్ బ్యాంక్ మేనేజర్ శేషగిరీరావు, ఇరిగేషన్ ఎస్ఈ విజయకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రికి మరో 8 డయాలసిస్ మెషిన్లు

చిత్తూరు రూరల్: డయాలసిస్ చేయించుకునే కిడ్నీ రోగులు పడే అవస్థలు వర్ణనాతీతం. వారానికి రెండు మూడు రోజులు తిరుపతి, ఇతర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లడం, అక్కడ మూడు, నాలుగు గంటలపాటు డయాలసిస్ చేయించుకోవడం ఇబ్బందులతో కూడుకున్న వ్యవహారం. ఇది గమనించిన జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి అధికారులు కొత్తగా 8 రక్త శుద్ధి యంత్రాలను తెప్పించారు. ఇప్పటి వరకు 12 యంత్రాలు ఉన్నాయి. వీటితో రోజూ 36 మందికి డయాలసిస్ చేయిస్తున్నారు. అయితే మరో 24 మంది వెయిటింగ్ లిస్ట్‌లో ఉంటున్నారు. దీనికితోడు బాధితులు కొందరు తిరుపతికి వెళ్లలేని పరిస్థితి మూలాన ఇక్కడే డయాలసిస్‌కు క్యూ కడుతున్నారు. ఈ నేపథ్యంలో మరో 8 మెషిన్లు తెప్పించారు. ఎంఎస్ బిల్డింగ్‌లోని నాలుగో అంతస్తులో డయాలసిస్ సెంటర్ ఏర్పాటు పనులకు పూనుకున్నారు. నెల రోజుల్లో ఈ సెంటర్ అందుబాటులోకి వస్తుందని అధికారులు పేర్కొన్నారు.

స్కానింగ్ మెషిన్ల పెంపు

కలెక్టర్ ఆదేశాల మేరకు చిత్తూరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో ఒక కొత్త స్కానింగ్ మెషిన్ అందుబాటులోకి తీసుకురానున్నారు. అలాగే మూలనపడ్డ మరో రెండు పాత మెషిన్లను రిపేరు చేయించి వాటిని కూడా వినియోగించే దిశగా చర్యలు తీసుకున్నారు.

ఈనెలలోపు వ్యవసాయ సర్వీసులు

చిత్తూరు కార్పొరేషన్: గత ఏడాది ఆగస్టులోపు వ్యవసాయ సర్వీసుల కోసం డబ్బులు కట్టిన రైతులకు ఈనెలలోపు సర్వీసులు ఇవ్వాలని ట్రాన్స్‌కో ఎస్ఈ కృష్ణారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఆయన ఈఈ, డీఈ, ఏఈలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జగనన్న లే అవుట్లలో ఇళ్లకు త్వరితగతిన విద్యుత్ సర్వీసులు ఇవ్వాలన్నారు. డీబీటీ పథకం కింద ఆధార్ నమోదును పూర్తి చేయాలన్నారు. శాఖల పరంగా ఉన్న విద్యుతు బకాయిలను చెల్లించాలని సంబంధిత అధికారులకు నోటీసులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈఈ హరి, ఇన్‌చార్జి ఈఈ పద్మనాభపిళ్లై, డీఈఈ శేషాద్రి, జ్ఞానేశ్వర, హేమకుమార్, ఏఈలు పాల్గొన్నారు.

ఓటు నీ ఆయుధం



- ప్రజాస్వామ్యంలో ఓటు వేయడం మన హక్కు
- ఓటరు చైతన్యానికి అధికార యంత్రాంగం విస్తృత ప్రచారం
- నేడు 13వ జాతీయ ఓటరు దినోత్సవం
- జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో నిర్వహణకు సన్నద్ధం

చిత్తూరు కలెక్టరేట్ : మంచి పాలకులను ఎంచుకునే హక్కు ప్రజల చేతుల్లోనే ఉంటుంది. కేవలం ఓటు అనే వజ్రాయుధంతోనే అది సాధ్యం.అందరూ ఓటు హక్కును వినియోగించుకున్నప్పుడే దానికి సార్థకత లభిస్తుంది. ప్రపంచంలోని ప్రజాస్వామ్య దేశాల్లో మన దేశానికి ప్రత్యేక స్థానం ఉంది. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించింది. అందుకే ఓటును దుర్వినియోగం చేయకుండా దానికి ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ప్రతి ఏటా జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఎన్నికల కమిషన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించడం పరిపాటి. ఈ దినోత్సవాన్ని పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ హరినారాయణన్ క్షేత్రస్థాయి అధికారులను ఆదేశించారు.

ఓటు విలువ తెలియజేయడానికే..

జిల్లా వ్యాప్తంగా 7 నియోజకవర్గాల్లో ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఏడు నియోజకవర్గాల్లో ఉన్న 15,47,258 మంది ఓటర్లలో మహిళా ఓటర్లు 7,77,839, పురుష ఓటర్లు 7,69,306 మంది, ఇతరులు 113 మంది ఉన్నారు. ర్యాలీలు నిర్వహించి ఓటు ప్రాధాన్యతపై అవగాహన కల్పించనున్నారు. జిల్లాలో ఓటరు జాబితాకు ఆధార్ కార్డు అనుసంధానం 89.14 శాతం పూర్తి చేశారు. 174 పోలింగ్ కేంద్రాలకుగాను 15,47,258 మంది ఓటర్లకు 13,76,070 మంది ఆధార్ అనుసంధానం పూర్తి చేశారు. అదే విధంగా జిల్లాలో పారదర్శకమైన ఓటరు జాబితా, కసరత్తు నిర్వహణలో ప్రతిభ చాటినందుకు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హరి నారాయణన్‌ను ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా ఎంపిక చేశారు. ఆయన బుధవారం రాష్ట్ర స్థాయిలో నిర్వహించే జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో అవార్డును స్వీకరించనున్నారు. అలాగే జిల్లా స్థాయిలో ఉత్తమ పనితీరు కనబరచిన బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఉన్నతాధికారులు అవార్డులు ప్రదానం చేయనున్నారు.

కొత్త ఓటరుగా నమోదు కావాలంటే...

ఓటరుగా నమోదు చేసుకునేందుకు విధిగా ప్రతి ఒక్కరూ గుర్తింపు పత్రం(రేషన్ కార్డు, విద్యుత్ బిల్లు, ఆధార్ కార్డు, ఇంటిపన్ను రశీదు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు) తదితర వాటిల్లో ఏదైనా ఒకదానిని దరఖాస్తు ఫారానికి జతచేసి అందజేసి ఓటు హక్కు పొందవచ్చు.

- ఓటరుగా నమోదు చేసుకునేందుకు సంబంధిత తహసీల్దార్, ఆర్డీఓ కార్యాలయాల్లో ఫారం-6 దరఖాస్తును ఉచితంగా పొందవచ్చు.
- ఓటరుగా నమోదు ప్రక్రియలో తప్పులను సరి చేసుకోవడానికి ఫారం-8 దరఖాస్తును పూర్తి చేసి ఇవ్వాలి. నియోజకవర్గ పరిధిలో ఒక పోలింగ్ కేంద్రం నుంచి మరో పోలింగ్ కేంద్రానికి ఓటును బదిలీ చేసుకోవడానికి ఫారం-8ను ఉపయోగించుకోవాలి.
- ఓటరుగా నమోదై ఫొటో మారిన పక్షంలో ఫారం-8 ద్వారా రెండు కలర్ ఫొటోలను అధికారులకు అందజేయాలి. వివరాల ఆధారంగా మార్పులు చేసుకునే సౌలభ్యం ఉంది.
- ఓటర్ల జాబితాలో పేర్ల తొలగింపునకు ఫారం-7ను ఉపయోగించుకోవాలి. ఓటరుగా నమోదు చేసుకునేందుకు ఆన్‌లైన్‌లోనూ ఎన్నికల కమిషన్ వెసులుబాటు కల్పించింది.

జిల్లాల్లో వయస్సు వారీగా ఓటర్ల వివరాలు ఇలా

18-19	20-29	30-39	40-49	మొత్తం (సర్వీస్ ఓటర్లు మినహా)
13,079	2,51,498	4,21,637	3,59,666	15,43,730
50-59	**60-69**	**70-79**	**80 ఏళ్లకు పైబడి**	
2,39,390	1,51,544	79,743	27,173	

ర్యాలీలతో అవగాహన



ర్యాలీలతో ఓటు హక్కుపై అవగాహన కల్పిస్తాం. స్థానిక అంబేడ్కర్ భవన్‌లో జిల్లా స్థాయి కార్యక్రమం, జిల్లాలోని అన్ని మండల, మునిసిపాలిటీ, డివిజన్ కేంద్రాల్లోనూ ఘనంగా నిర్వహించాలని ఆదేశించాం. కొత్తగా ఓటరు కార్డు పొందిన యువ ఓటర్లకు, విభిన్న ప్రతిభావంతులకు, వయో వృద్ధ ఓటర్లకు సన్మాన కార్యక్రమం నిర్వహించి, జాతీయ ఓటర్స్ డే ప్రతిజ్ఞ చేయిస్తాం.

– హరినారాయణన్, కలెక్టర్

రేపటి నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం

- అవగాహన పోస్టర్ల ఆవిష్కరణలో డీఆర్ఓ రాజశేఖర్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఆర్ఓ రాజశేఖర్

చిత్తూరు కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు ఈ నెల 26న గణతంత్ర దినోత్సవం నుంచి ప్లాస్టిక్ ఫ్లెక్సీల నిషేధం అమలులోకి తెస్తున్నట్లు డీఆర్ఓ రాజశేఖర్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. జీఓ 81 ప్రకారం సింగిల్ యూస్ ప్లాస్టిక్ వాడకం నిషేధించారని, దీనిపై క్షేత్రస్థాయిలో ఆయాశాఖల అధికారులు విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు. నిషేధం అమలు తీరు నివేదికలను ప్రతి వారం కలెక్టరేట్‌కు పంపాలన్నారు. అనంతరం ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాల పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ అధికారి నరేంద్రబాబు, నగరి కమిషనర్ వెంకటరామిరెడ్డి, పంచాయతీరాజ్ శాఖ ఏఈ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ డీఎస్పీకి ఉద్యోగోన్నతి

చిత్తూరు అర్బన్ : చిత్తూరు ట్రాఫిక్ డీఎస్పీ జే.తిప్పేస్వామికి ఏఎస్పీగా ఉద్యోగోన్నతి పొందారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. పలువురు పోలీసుశాఖ అధికారులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

ఆర్‌బీకే, సచివాలయాల పనితీరు భేష్

– కేంద్ర బృందం ప్రశంస



ఇండియన్ బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో వస్త్ర చిత్రకళను పరిశీలిస్తున్న కేంద్ర బృందం

చిత్తూరు అగ్రికల్చర్: రైతు భరోసా కేంద్రాలు (ఆర్‌బీకే), గ్రామీణ సచివాలయాల పనితీరు చాలా బాగుందని కేంద్ర బృందం ప్రశంసించింది. జిల్లాలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల తీరును పరిశీలించేందుకు మంగళవారం రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆఫ్ ఒడిశాకు చెందిన కేంద్ర బృందం సభ్యులు శిశిర్ కుమార్ సాహు, సత్యబ్రాత్ బెహ్రా జిల్లాకు విచ్చేశారు. ఈ బృందం పదిరోజుల పాటు జిల్లాలో పర్యటించి, కేంద్ర ప్రభుత్వ పథకాలైన జాతీయ ఉపాధి హామీ, సామాజిక పింఛన్లు, ప్రధాన మంత్రి ఆవాజ్ యోజన, గ్రామీణ సడక్ యోజన్..ఇత్యాది వాటి పనులను పరిశీలించనుంది. స్థానిక డ్వామా కార్యాలయ సమావేశ మందిరంలో బృంద సభ్యులు వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. అనంతరం నగరంలోని ఇండియన్ బ్యాంకు నిర్వహిస్తున్న స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో వస్త్ర చిత్రకళ, ఎంబ్రాయిడరీ పై యువత పొందుతున్న శిక్షణను పరిశీలించారు. ఆ తర్వాత పెనుమూరు మండలం కలికిరి పంచాయతీ గ్రామ సచివాలయం, ఆర్బీకే కేంద్రాలను సందర్శించి వాటి పనితీరును పరిశీలించారు. గ్రామీణ ప్రాంతాల్లోనే సచివాలయం, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి అన్ని సదుపాయాలను ప్రజలకు, రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చిన విధానం బావుందని కితాబిచ్చారు. కలికిరి, పెద్దకలికిరి, గొల్లపల్లె గ్రామాల్లో బృంద సభ్యులు పర్యటించి సామాజిక పింఛనుదారులు, డ్వాక్రా మహిళలతో ముఖాముఖి నిర్వహించారు. డ్వాక్రా సభ్యులు పొందుతున్న బ్యాంకు రుణాలు, చెల్లింపులు, బుక్ కీపింగ్, సంఘాల నిర్వహణ, జీవనోపాదులతో ఆర్థికాభివృద్ధి, 'ఉపాధి ' పండ్లతోటల పెంపకం, అంతర పంటల సాగు తదితర పనులను పరిశీలించారు. 'అమృత్ సరోవర్' నీటి నిల్వ కుంటల ఏర్పాటు పనితీరు చాలా బాగుందన్నారు. కార్యక్రమంలో డ్వామా పీడీ గంగాభవాని, గృహ నిర్మాణ శాఖ పీడీ పద్మనాభం, అధికారులు పాల్గొన్నారు.

'పాదయాత్రలో లోకేష్‌కు పరాభవం తప్పదు'



మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

పాలసముద్రం : నారా లోకేష్ పాదయాత్రకు పూనుకోవడం ఏ దేవుడికి ప్రీతి? అని డిప్యూటీ సీఎం, ఎక్సైజ్ శాఖ మంత్రి కే.నారాయణస్వామి ప్రశ్నించారు. మంగళవారం పాలసముద్రంలో ఆయన మీడియాతో మాట్లాడారు. లోకేష్ పాదయాత్ర చేస్తే ప్రజలు నిలదీసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు నాయుడు తన స్వార్థం కోసం చిత్తూరు డెయిరీ, షుగర్ ఫ్యాక్టరీలను మూసి వేయించాడని, దీనిపైనే కాకుండా టీడీపీ హయాంలో ప్రజలకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. ఈ నేపథ్యంలో పాదయాత్రలో లోకేష్‌కు ప్రజల నుంచి పరాభవం తప్పదని పేర్కొన్నారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎస్.శివప్రకాష్ రాజు, పార్టీ మండల కన్వీనర్ తులసియాదవ్, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు అన్నలగన్, వైస్ ఎంపీపీ శేఖర్‌తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు వేతనాలు పెంచరూ!



కేంద్ర బృందం సభ్యులకు వినతి పత్రం ఇస్తున్న జెడ్పీ చైర్మన్, సీఈఓ

చిత్తూరు కార్పొరేషన్: ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న కూలీలకు వేతనాలు, పనిదినాలను పెంచాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, సీఈఓ ప్రభాకర్ రెడ్డి కోరారు. మంగళవారం జెడ్పీ కార్యాలయానికి వచ్చిన కేంద్ర బృందం సభ్యులు శిశిర్ కుమార్ సాహు, సత్యబ్రాత్ బెహ్రాకు వారు వినతిపత్రం ఇచ్చారు. అలాగే, డార్క్ ఏరియాలో ఉన్న 45 గ్రామాలను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం సమావేశం ఏర్పాటు చేసి ఎంజీఎన్ఆర్‌జీఎస్, డీడీయూ, పీఎంఎవై, స్వామిత్ర, పీఎంకేఎస్‌వై పథకాలపై కేంద్ర బృందం సమీక్షించింది. కార్యక్రమంలో పీఆర్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగజ్యోతి, డ్వామా పీడీ గంగాభవాని, హౌసింగ్ పీడీ పద్మనాభం, డీఆర్‌డీఏ పీడీ తులసి, పీఆర్ ఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, డీపీఆర్‌సీ డీసీ షణ్ముగం తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రారంభ శిలాఫలకం ధ్వంసం

- టీడీపీ మద్దతుదారుల పనేనా?
- గతంలోనూ వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వైనం



ఆగంతకులు ధ్వంసం చేసిన రోడ్డు శిలాఫలకం

శ్రీరంగరాజపురం :మండలంలోని కమ్మకండ్రిగ వద్ద డిప్యూటీ సీఎం ప్రారంభించిన రోడ్డు ప్రారంభ శిలాఫలకాన్ని ఆగంతకులు ధ్వంసం చేశారు. మంగళవారం ఇది వెలుగులోకి వచ్చింది. దీనిని పరిశీలించిన వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. పుల్లూరు నుంచి రంగంపేట వరకు కలుపుతు ఫారెస్ట్ మీదుగా రూ.50 లక్షలతో తారురోడ్డు వేశారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎంపీ రెడ్డెప్ప గత ఏడాది ఆగస్టు 10న రోడ్డును ప్రారంభించి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ నేపథ్యంలో సోమవారం రాత్రి ఆగంతకులు ధ్వంసం చేయడం, అంతకుముందు సంక్రాంతి పండుగ రోజున పెద్దకొండపల్లె వద్ద కూడా సీసీ రోడ్డు శిలాఫలకాన్ని ధ్వంసం చేయడం.. తొలుత గత ఏడాది సంక్రాంతి పండుగ రోజు సైతం మండల కేంద్రానికి సమీపంలో దివంగత సీఎం వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేయడం చూస్తే ..ఇవన్నీ పక్కా వ్యూహం ప్రకారమే చేసినట్లు తేలుతోంది. దీనిపై అప్పట్లో టీడీపీ మద్దతుదారులే వైఎస్సార్ విగ్రహాన్ని ధ్వంసం చేశారని వైఎస్సార్ సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ప్రస్తుత ఘటనపై డీసీసీబీ డైరెక్టర్ బాలసుబ్రమణ్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా రోడ్డు సౌకర్యం కోసం ఎంతో మంది నాయకులు, అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పట్టించుకున్న పాపానపోలేదని, వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే డిప్యూటీ సీఎం నారాయణస్వామి చొరవతో రోడ్డు సమస్యకు మోక్షం లభించిందని చెప్పారు. సీఎంకు ఆయన సమస్య నివేదించి, అటవీశాఖ అనుమతులు పొంది, రోడ్డు వేయించారన్నారు. దీనిని సహించలేని టీడీపీ మద్దతుదారులే శిలాఫలకంపై సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రి ముఖచిత్రాలను ధ్వంసం చేశారని, కారకులెవరో గుర్తించి అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి, సర్పంచ్ బాబు, గురవారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల టెంటు పోరు!

– నాయకుల నడుమ 'అన్నదానం' ముసలం



టెంటును ఆటోలో తరలింపు



రోడ్డు పక్కన చేస్తున్న అన్నదానం

శాంతిపురం: మండల కేంద్రంలో అన్నదానం చేయడానికి ఏర్పాటు చేసిన టెంటుపై ఇద్దరు తెలుగుదేశం నాయకుల నడుమ తలెత్తిన వివాదం పోలీస్ స్టేషన్‌కు చేరింది. వివరాలు..ఇటీవల ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా శాంతిపురంలో టీడీపీ నాయకుడు జయప్రకాష్(జెపి) అన్నదాన శిబిరాన్ని ప్రారంభించారు. జాతీయ రహదారి పక్కన ప్రభుత్వ భూమిలో షామియానా వేసి జేపీ ఫౌండేషన్ పేరిట వారం రోజులుగా మధ్యాహ్నం పేదలకు ఉచితంగా భోజనం పెడుతున్నారు. అయితే మంగళవారం ఉదయం 11.30 గంటల ప్రాంతంలో టీడీపీకి చెందిన మాజీ వైస్ ఎంపీపీ నందిగం ఉదయ్‌కుమార్ ఈ టెంటును తొలగించారు. టెంటు సామగ్రిని ఆటోలో తరలించారు. దీనిపై జయప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. అప్పటికే అన్నదానం చేయడానికి భోజనం సిద్ధం చేసి ఉండడంతో అదే ప్రాంతంలో అన్నదానం చేశారు. ఆ తర్వాత రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తాను దళితుడనే చిన్నచూపుతోనే దౌర్జన్యంగా అన్నదానం టెంటును తొలగించారని ఫిర్యాదులో ఆరోపించాడు. దీనిపై ఎస్ఐ మునస్వామి కేసు నమోదు చేశారు. ఇక, ఈ వ్యవహారంపై ఉదయ్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఎన్టీఆర్ వర్ధంతి రోజున మాత్రమే అన్నదానం చేస్తానని జేపీ చెప్పడంతో తానే ముఖ్యఅతిథిగా ఆ కార్యక్రమాన్ని ప్రారంభించానని, అయితే రోజూ ఈ కార్యక్రమం కొనసాగిస్తూండడంతో ఆటో స్టాండుకు, ట్రాఫిక్‌కు అడ్డుగా టెంటు ఉంటోందని ఆటో డ్రైవర్లు తన దృష్టికి తెచ్చారని చెప్పారు. తాను చెప్పినా జేపీ పట్టించుకోకపోవడంతో టెంటును తొలగించినట్లు చెప్పారు.

క్లుప్తంగా

ప్రసూతి విభాగంలో నిఘా కన్ను

చిత్తూరు రూరల్ : జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి ప్రసూతి విభాగంలో నిర్లక్ష్యంతో పాటు అవినీతికి తావు లేకుండా నిఘా వ్యవస్థను పూర్తి స్థాయిలో తీసుకొస్తున్నామని ఆసుపత్రి సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్ తెలిపారు. చిత్తూరు జిల్లా ఆసుపత్రిలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల సాక్షి దినపత్రికలో వచ్చిన కథనాల ఆధారంగా ప్రసూతి విభాగంపై దృష్టి పెట్టామన్నారు. పాప పుడితే 1000, బాబు పుడితే రూ. 2 వేలు వసూళ్లపై సిబ్బంది తీరుపై మండిపడ్డారు. మళ్లీ కూడా అక్కడ ఫిర్యాదులు వస్తున్నాయని, అక్కడ పనిచేస్తున్న వారందరినీ వేరే విభాగానికి మారుస్తామన్నారు. ఇకపై ప్రసవానికి డబ్బులు డిమాండ్ చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఇద్దరు అధికారులను పర్యవేక్షణ నిమిత్తం కేటాయిస్తామన్నారు. బోర్డులు కూడా పెడుతున్నామని..ఆ విభాగంలో డబ్బులు అడిగితే నేరుగా ఫిర్యాదు చేయవచ్చన్నారు.

ఉగాదికి ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

- సచివాలయాల్లో విధిగా 'స్పందన'
- ఆస్పత్రిలో అదనపు భవనాల నిర్మాణం వేగవంతం చేయండి
- కలెక్టర్ హరినారాయణన్ ఆదేశం



ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్

పలమనేరు: పేదలందరికీ ఇళ్లు కార్యక్రమానికి సంబంధించిన ఇళ్ల నిర్మాణాలను ఉగాదిలోపు పూర్తి చేసి, నిర్దేశిత లక్ష్యాలను అధిగమించేందుకు గృహ నిర్మాణ శాఖ అధికారులు చొరవ చూపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ ఆదేశించారు. మంగళవారం ఆయన పలమనేరు మున్సిపాలిటీలోని గంటావూరు సచివాలయం, స్థానిక ఏరియా ఆస్పత్రిలో నాబార్డు నిధులతో నిర్మిస్తున్న అదనపు భవనాల నిర్మాణం, జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం అమలు, పట్టణ సమీపంలోని బొమ్మిదొడ్డి లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణాల పురోగతిని పరిశీలించారు. గంటావూరు సచివాలయంలో సంక్షేమ పథకాల్లో అర్హులు, అనర్హుల జాబితాను పరిశీలించారు. స్పందన కార్యక్రమాన్ని విధిగా సచివాలయాల్లో నిర్వహించాలని ఆదేశించారు. ఆస్పత్రిలో రూ.16కోట్లతో నిర్మిస్తున్న వంద పడకల భవన నిర్మాణ పనులు వేగవంతం చేయాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ నాయక్‌ను ఆదేశించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో భోజనం ఎలా ఉందో విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం రుచికరంగా భోజనం పెట్టాలని, అలాగే హెచ్ఎంలు, ఎంఈఓలు పర్యవేక్షించాలని సూచించారు. పట్టణ సమీపంలోని జగనన్న లేఅవుట్‌లో 2086 ఇళ్లు నిర్మాణం జరుగుతుండగా ఇప్పటిదాకా 254 ఇళ్ల నిర్మాణం పూర్తయిందని హౌసింగ్ డీఈ రమేష్ రెడ్డి కలెక్టర్‌కు తెలిపారు. దీనిపై ఆయన పైవిధంగా ఆదేశించారు.
కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, ఎంఈఓ లీలారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దళితవాడలకు శ్మశాన వాటికలు తప్పనిసరి

- జనాభా ప్రాతిపదికన స్థలాల ఎంపిక
- జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్



శ్మశాన వాటిక భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్

పెనుమూరు (కార్వేటినగరం): దళితవాడలకు శ్మశాన వాటికలు తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని అమ్మగారిపల్లె, కత్తిరెడ్డిపల్లె, బందార్లపల్లె, ఆర్కేపురం, సన్యాసిపల్లె దళితవాడలకు సంబంధించిన శ్మశానవాటిక భూములతోపాటు అసైన్‌మెంట్ భూములను జేసీ పరిశీలించారు. శ్మశాన వాటిక స్థలం ఎంపికపై గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అలాగే కేటాయించిన శ్మశాన వాటికలను ఆయా పంచాయతీలకు అప్పగించాలని తహసీల్దార్ విజయభాస్కర్‌ను ఆదేశించారు. అసైన్‌మెంట్ భూములకు చాలా మంది దరఖాస్తు చేసుకున్నారని, అర్హులను గుర్తించి వారికి భూములు కేటాయించాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు, ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. శ్మశానవాటికలు లేని గ్రామాలు, అలాగే స్థలాలు ఎంపిక చేసిన గ్రామా లు, ఎంపిక చేయాల్సిన గ్రామాల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అర్హులైన వారికి అసైన్‌మెంట్ భూములను ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రభుత్వం కృషి



ఉత్తమ పేయదూడ రైతుకు బహుమతి ప్రదానం చేస్తున్న అధికారులు

- వెటర్నరీ డీడీ ప్రభాకర్

తవణంపల్లె: ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాడి పరిశ్రమాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చి, ఎనలేని కృషిచేస్తున్నారని పశుసంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ ప్రభాకర్ అన్నారు. మంగళవారం మండలంలోని దిగువ మోదలపల్లెలో ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సౌజన్యంతో పశుసంతతి పరిశీలనా పథకం కింద రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సంకరజాతి జెర్సీ పేయ దూడల ప్రదర్శనను ఆయన ప్రారంభించారు.
అనంతరం గోపూజ చేసి, అరటి పండు పెట్టి, వందనం చేశారు. తర్వాత దిగువ మోదలపల్లె సచివాలయం పరిధిలోని రైతులు తీసుకువచ్చిన సంకరజాతి పేయ దూడలను వెటర్నరీ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో డీడీ డాక్టర్ ప్రభాకర్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్ల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్బీకేల ద్వారానే రైతులకు రాయితీ విత్తనాలు సరఫరా చేస్తున్నామన్నారు. పశువైద్య సేవలు పొందడానికి 1962 నంబరు ఫోన్ చేసినా, సమాచారం ఇచ్చినా వెంటనే ఉచితంగా పశువులకు వైద్యం చేస్తారని తెలిపారు. ప్రభుత్వం పశువులకు బీమా సౌకర్యం కల్పనకు ప్రణాళిక తయారు చేసినట్లు చెప్పారు.
పాలు పితికే యంత్రాలు కోసం ప్రతిపాదనలు పంపామని, ప్రభుత్వం అనుమతిస్తే వెంటనే రైతులకు అందజేస్తామన్నారు. అనంతరం ఉత్తమ దూడలను ఎంపిక చేసి, వాటి యజమానులైన రైతులకు బహుమతులు అందజేశారు. పీటీపీ ప్రోగ్రాం సక్రమంగా నిర్వహించిన టి.పుత్తూరు వెటర్నరీ అసిస్టెంట్ తులసికుమార్‌ను వెటర్నరీ అధికారులు సత్కరించి బహుమతి అందజేశారు. కార్యక్రమంలో పశుసంవర్థక శాఖ పీటీపీ డీడీ డాక్టర్ వాసు, ఏడీ డాక్టర్ ఆసీఫ్, తిరుపతి డీఎల్ ఈఓ డాక్టర్ బాలసుబ్రమణ్యం, ఐరాల ఏడీ పద్మజ, వెటర్నరీ అధికారులు డాక్టర్ లావణ్య, డాక్టర్ పల్లకి, డాక్టర్ యశోద, గోపాలమిత్ర తులసీకుమార్, పీటీపీ సూపర్‌వైజర్ కొండలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రికి వెళ్తే ఇంట్లో దొంగలు పడ్డారు



దొంగలు పగలగొట్టిన బీరువా

చిత్తూరు అర్బన్: ఇంటి తాళాలు పగలగొట్టి నగదు, బంగారు ఆభరణాలు చోరీకి చేసిన సంఘటన స్థానిక దుర్గానగర్‌లో మంగళవారం వెలుగులోకి వచ్చింది. టూటౌన్ ఎస్ఐ మల్లికార్జున తెలిపిన వివరాలు.. దుర్గానగర్ కాలనీలో నివాసం ఉంటున్న సందీప్‌కుమార్ నెల్లూరులోని ఓ ప్రైవేటు కళాశాలలో ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న తన తండ్రి సదాశివరెడ్డిని చికిత్స నిమిత్తం గత నెల బెంగుళూరులోని మణిపాల్ ఆసుపత్రికి సందీప్ తీసుకెళ్లారు. ఇదే అవకాశంగా భావించిన దొంగలు ఆ ఇంటిని ఓ చూపు చేశారు. సోమవారం రాత్రి ఇంటి తాళాలు పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా పగలగొట్టి అందులోని బట్టలను చెల్లాచెదురుగా పడేశారు. అందులోని రూ.10వేల నగదు, బంగారు ఆభరణాలు చోరీ చేశారు. మంగళవారం సందీప్ బెంగళూరు నుంచి వచ్చారు. ఇంటి తాళాలు పగలగొట్టి ఉండడంతో దొంగలు పడ్డారని గ్రహించారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లీజుకు ఆర్టీసీ స్థలం

పుత్తూరు రూరల్: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో 1.07 ఎకరాల స్థలంతో పాటు 52 సెంట్లు, 86 సెంట్లు కలిగిన స్థలాలు 15 ఏళ్ల లీజుకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు డిపో మేనేజర్ ప్రశాంతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. టెండర్ డాక్యుమెంట్ ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.5 వేలు, జీఎస్టీతో చెల్లించి, apsrtc.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా టెండర్ ఫారాలను పొందవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు 7331106731, 9959268390 నంబర్లకు ఫోన్ చేసి సంప్రదించాలని కోరారు.

గొర్రెల కాపరిపై హత్యాయత్నం

చిత్తూరు అర్బన్: చిత్తూరు మురకంబట్టుకు చెందిన గొర్రెల కాపరిపై మంగళవారం హత్యాయత్నం చోటుచేసుకుంది. మురకంబట్టు అగ్రహారానికి చెందిన గొర్రెల కాపరి రామ్మూర్తి (60), అతని సమీప బంధువులు రాము, హరి గొర్రెలు కాస్తూ, వాటిని విక్రయిస్తుంటారు. అయితే కొంతకాలంగా వీళ్లకు వ్యాపారంలో గొడవలు తలెత్తాయి. దీంతో రాము, హరి ఇద్దరూ కలిసి కత్తులతో రామ్మూర్తిపై దాడికి దిగారు. తీవ్రంగా గాయపడ్డ బాధితుడ్ని కుటుంబ సభ్యులు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరసిద్ధుని సేవలో విశ్రాంత సీజే రమణ



విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ చైర్మన్

కాణిపాకం(యాదమరి): సుప్రీంకోర్టు విశ్రాంత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వీ రమణ మంగళవారం రాత్రి కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామివారిని కుటుంబ సమేతంగాదర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ వెంకటేశు వారికి స్వాగతం పలికారు. చిత్తూరు జిల్లా జడ్జి భీమారావు, చిత్తూరు డీఎస్పీ శ్రీనివాసమూర్తి, సీఐ శ్రీనివాసులురెడ్డి, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉరేసుకుని ఆత్మహత్య

గుడిపాల: ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుడిపాల ఎస్ఐ రాజశేఖర్ మంగళవారం తెలిపారు. ఆయన కథనం..189 కొత్తపల్లె దళితవాడకు చెందిన సుందర్‌రాజన్(37)కు 15 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇతని భార్య, కుమార్తె అనారోగ్యం కారణంగా ఏడేళ్ల క్రితం మృతి చెందారు. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయిన సుందర్‌రాజన్ తాగుడుకు బానిసయ్యాడు.ఈ నేపథ్యంలో సమీపంలోని ఓ చెట్టుకు ఉరివేసుకొని బలవన్మరణం చెందాడు. మంగళవారం ఇది స్థానికుల ద్వారా వెలుగులోకి వచ్చింది. సమాచారం అందుకున్న ఎస్ఐ సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కెళ్లాడు

పుత్తూరు రూరల్: పాల ప్యాకెట్లు కొనడానికి వచ్చినట్లు వచ్చి బంగారు గొలుసు లాక్కెళ్లిపోయాడ్రా నాయనా! అంటూ ఓ వృద్ధురాలు లబోదిబోమంది. మంగళవారం ఈ సంఘటన స్థానిక సుబ్రమణ్యం స్వామి ఆలయం వీధిలో చోటుచేసుకుంది. ఈ వీధిలో పాపమ్మ(65) పాల ప్యాకెట్ల వ్యాపారం చేస్తోంది. ఉదయం 6 గంటల ప్రాంతంలో ఓ యువకుడు పాలప్యాకెట్లు కావాలంటూ పాపమ్మ వద్దకు వచ్చాడు. ఆమె పాలప్యాకెట్ తీసి ఇస్తుండగా ఆమె మెడలోని ఐదున్నర సవర్ల బంగారు చెయిన్‌ను లాక్కుని బైక్ మీద అతడు ఉడాయించాడు. ఆ సమయంలో జనసంచారం లేకపోవడంతో క్షణాల వ్యవధిలోనే ఆ చెయిన్ స్నాచర్ మాయమయ్యాడు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చీటింగ్ కేసులో ఇద్దరికి రిమాండ్

తిరుపతి లీగల్: తిరుమల శ్రీవారి వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లను బ్లాక్‌లో అధిక ధరకు విక్రయించి భక్తులను మోసం చేసిన కేసులో ఇద్దరికి ఫిబ్రవరి 7వ తేదీవరకు వరకు రిమాండ్ విధిస్తూ తిరుపతి రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోటేశ్వరరావు మంగళవారం ఆదేశాలు జారీచేశారు. చిత్తూరు జిల్లా పెనుమూరు మండలం, గుట్టకింద పల్లి హరిజనవాడకు చెందిన కలికిరి సుబ్రమణ్యం అలియాస్ రజినీకాంత్, తిరుపతి గిరిపురానికి చెందిన కలికిరి లోకేష్ కలసి గుంటూరుకు చెందిన పొట్టి వెంకటశ్రీనివాసరావు అనే భక్తుడికి 4 వీఐపీ బ్రేక్ దర్శనం టిక్కెట్లను 12 వేల రూపాయలకు విక్రయించారు. విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో ఇద్దరు నిందితులు కలిసి ప్రజాప్రతినిధుల లేఖల ద్వారా దర్శన టిక్కెట్లను పొంది భక్తులకు అధిక ధరకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు. విజిలెన్స్ అధికారి శంకర్ బాబు ఫిర్యాదు మేరకు తిరుమల టూటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేసి ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచారు. ఈ కేసులో మరో ఇద్దరు నిందితులు ఉన్నట్లు పోలీసులు రిమాండ్ కోర్టులో పేర్కొన్నారు. అలాగే ఇద్దరు నిందితులు ఇదివరలో తిరుమలలో పలు చీటింగ్ కేసుల్లో నిందితులుగా ఉన్నట్లు రిమాండ్ కోర్టులో పేర్కొన్నారు.

మద్యం, సారా ధ్వంసం



గుడిపాల: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న 137 లీటర్ల మద్యం, 581 లీటర్ల నాటు సారాను మంగళవారం ధ్వంసం చేశారు. గుడిపాల, కాణిపాకం, ఐరాల, యాదమరి పోలీస్‌స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడ్డ మద్యం, సారాను ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ అయిషాబేగం ఆధ్వర్యంలో ధ్వంసం చేశారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాసులురెడ్డి, ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయ వనరుల పెంపుపై దృష్టి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ తులసి

చిత్తూరు అగ్రికల్చర్: స్వయం సహాయక సంఘ సభ్యులు ఆదాయ వనరుల పెంపుపై దృష్టి సారించి, ఆ దిశగా కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ తులసి పిలుపునిచ్చారు. మంగళవారం సాయంత్రం స్థానిక జిల్లా సమాఖ్య సమావేశ మందిరంలో జిల్లా సమాఖ్య సభ్యుల సమావేశం నిర్వహించారు. మొబైల్ చేయూత మార్టల ద్వారా సుగంధ ద్రవ్యాలు, డ్రై ఫ్రూట్స్, కర్పూరం, అగరబత్తీలు, సాంబ్రాణి తదితర వస్తువులతో పాటు చింతపండు, రాగులు కూడా విక్రయిస్తున్నారన్నారు. ఈ మార్టుల్లో నాణ్యమైన వస్తువులను తక్కువ ధరకే ఇస్తున్నట్టు గ్రామీణులకు కూడా తెలియజేసేందుకు జిల్లా, మండల సమాఖ్య సభ్యులు కృషి చేయాలన్నారు. తద్వారా మార్టలలో విక్రయాలు పెరిగి ఆర్థికాభివృద్ధిని సాధించవచ్చన్నారు. స్థానికంగా ఉన్న వనరులను సద్వినియోగం చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందు వచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డీపీఎం వెంకటేశ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల ఫలితాలు విడుదల

చిత్తూరు కలెక్టరేట్ : జాతీయ స్థాయి కథలు, కవితల పోటీల ఫలితాలు విడుదల చేసినట్లు ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ మాసపత్రిక సంపాదకులు తులసీనాథం నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కథల పోటీల్లో హైదరాబాద్‌కు చెందిన తుర్లపాటి లక్ష్మి, విజయనగరం జిల్లాకు చెందిన రమేష్‌కుమార్, కర్నూలుకు చెందిన విజయప్రసాద్ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో విజేతలుగా నిలిచారని అలాగే, కవితల పోటీల్లో గుంటూరుకు చెందిన రవి, నిజామాబాద్‌కు చెందిన గోపాల్, విజయవాడకు చెందిన శివప్రసాద్ గెలుపొందారని ఆయన వెల్లడించారు.

బాలికలను ప్రోత్సహిద్దాం

– సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి



మాట్లాడుతున్న ఏపీసీ వెంకటరమణారెడ్డి

చిత్తూరు కలెక్టరేట్ : బాలికలు అన్ని రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని జిల్లా సమగ్రశిక్ష ఏపీసీ పెద్దిరెడ్డి వెంకటరమణారెడ్డి అన్నారు. డీఈవో కార్యాలయం పక్కనున్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ బాలికా దినోత్సవం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ, ఆడపిల్లల హక్కులపై చైతన్యం కల్పించాలన్నారు. బాలికా విద్య ప్రాముఖ్యత, వారి ఆరోగ్యం, పోషణపై అవగాహన పెంచడం జాతీయ బాలికల దినోత్సవం ముఖ్య ఉద్దేశమన్నారు. ఎంఈఓలు సెల్వరాజ్, హసన్‌బాషా, విద్యార్థులు, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యంపై ట్రాన్స్‌కో దాడులు

- 146 కేసుల నమోదు
- రూ.3.26 లక్షల అపరాధం

చిత్తూరు కార్పొరేషన్: ట్రాన్స్‌కో చిత్తూరు అర్బన్, రూరల్ డివిజన్ల పరిధిలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు విద్యుత్ చౌర్యం, అదనపు లోడ్ మీద అధికారులు, సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. చిత్తూరు అర్బన్ పరిధిలో 337 సర్వీసులు తనిఖీ చేయగా 68 అదనపు లోడ్, 14 చౌర్యం కేసులు నమోదు చేసి రూ.1.96 లక్షలు అపరాధం, అలాగే చిత్తూరు రూరల్ పరిధిలో 224 సర్వీసులను తనిఖీ చేయగా 60 అదనపు లోడ్, 4 విద్యుత్ చౌర్యం కేసులు నమోదు చేసి రూ.1.30 లక్షలు అపరాధ రుసుం విధించారు. మొత్తం రెండు డివిజన్ల పరిధిలో 146 కేసులు నమోదు చేసి రూ.3.26 లక్షలు విద్యుత్ చౌర్యం, అపరాధ రుసుం చెల్లించాలని నోటీసులను వినియోగదారులకు అందజేసినట్లు ఎస్ఈ కృష్ణారెడ్డి వెల్లడించారు.

అన్న కుమారుడి ఆచూకీ కోసం..!



లక్ష్మీపతి

చిత్తూరు రూరల్: అన్న కుమారుడి ఆచూకీ కోసం పెనుమూరు మండలం చిన్న కలికిరికి చెందిన విశ్రాంత ఏఆర్ ఎస్సై వెందామరన్ మంగళవారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌ను ఆశ్రయించారు. విలేకరులతో తన గోడు వెళ్లబోసుకున్నారు. తన అన్న ఆరుముగం కుమారుడు టి. లక్ష్మీపతి(18) గతేడాది నవంబర్ 16న అదృశ్యమయ్యాడని, ఇతడు చిత్తూరులోని ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడన్నారు. కాలేజీకి సక్రమంగా వెళ్లడం లేదని కుటుంబసభ్యులు మందలించడంతో అలిగి ఇంటినుంచి వెళ్లిపోయాడని, అప్పటి నుంచి గాలిస్తున్నా ఆచూకీ లభించడం లేదని కన్నీటిపర్యంతమయ్యారు. ఇదే విషయమై పెనుమూరు పోలీస్ స్టేషన్‌లో నవంబర్ 19న ఫిర్యాదు చేశామన్నారు. పోలీసు ఉన్నతాధికారులు స్పందించి, ఆచూకీ కనుగొని, తమకు అప్పగించాలని ఆయన కోరారు. ఒక వేళ ఎవరికైనా తెలిస్తే 9441480239, 9342445482 నెంబరుకు తెలపాలని ఆయన కోరారు.